క్లుప్తంగా

చదువుతోనే మంచి భవిష్యత్తు



విద్యార్థులకు బ్యాగులు,యూనిఫారం అందజేస్తున్న సర్పంచ్ పార్తిమ్మ,ఎంపీటీసీ విజయలక్ష్మి

ముంచంగిపుట్టు: చదువుతోనే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని జర్జుల సర్పంచ్ డి.పార్తిమ్మ అన్నారు.మండలంలో గల జర్జుల పంచాయతీ కులబీరు ఎంపీపీఎస్ పాఠశాలలో 60 మంది విద్యార్థులకు సర్పంచ్ పార్తిమ్మ,ఎంపీటీసీ వి.విజయలక్ష్మి స్కూల్ బ్యాగులు,యూనిఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పార్తిమ్మ మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పే ప్రతి అంశాన్ని అర్థం చేసుకుంటూ చదువుకోవాలని,అన్ని సబ్జెక్టులలో పట్టు సాధించాలన్నారు. పేదరికాన్ని జయించాలంటే చదువునే ఆయుధంగా వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు,పాఠశాల కమిటీ చైర్మన్ జలంధర్,హెచ్‌ఎం బాలన్న,ఉపాధ్యాయులు కామేశ్వరరావు,మాలయ్య,నూకాలమ్మల తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి ఈవోపీఆర్‌డీగా సీతామహాలక్ష్మి



చింతపల్లి: మండల పరిషత్ విస్తరణ, పంచాయతీ గ్రామీణాభివృద్ధి అధికారి(ఈవోపీఆర్‌డీ)గా సీహెచ్ సీతామహాలక్ష్మి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం నుంచి ఆమె ఇక్కడకు వచ్చారు. గత రెండేళ్లుగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్.ఎస్.వి. శ్రీనివాసురావుకు అనకాపల్లి జిల్లా అచ్యుతాపురానికి బదిలీ అయింది.

వృద్ధులకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న రాజు

కొయ్యూరు: దివంగత బీజేపీ నేత లోకుల గాంధీ 50వ జయంతి సందర్భంగా మంగళవారం రత్నంపేటలో ఆయన శిష్యుడు అరిమెల రాజు వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. నేనుసైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు కె.శివప్రసాద్ సాయంతో 25 మంది వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మర్రి అర్జున్‌రెడ్డి,శివ, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీకాలనీలో తాగునీటి బోరు ఏర్పాటు



బోరు ఏర్పాటు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

ఎటపాక: జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్థానిక ఎస్సీ కాలనీలో మంగళవారం తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. గ్రామంలో మంచినీటి సమస్య ఉందని యువకులు తెలపడంతో బోరు ఏర్పాటు చేసినట్టు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు,ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్ తెలిపారు. బోరు పనుల ప్రారంభ కార్యక్రమంలో ఎడవల్లి భాస్కర్, రవికుమార్, శ్రీనివాస్, మహేష్, నరేష్, శ్రీను,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వరదల సమయంలో ప్రత్యామ్నాయ రోడ్లు నిర్మించాలి



ఐటీడీఏ పీవో అపూర్వభరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ సోడె నరసమ్మ

వీఆర్‌పురం: గోదావరి వరదల సమయంలో రోడ్లన్నీ మునిగిపోయతాయని, వడ్డుగూడెం, వీఆర్‌పురం గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు వీలుగా ప్రత్యామ్నాయ రోడ్లు నిర్మించాలని స్థానిక సర్పంచ్ సోడె నరసమ్మ ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌ను కోరారు. వీఆర్ పురం బీసీ కాలనీ మీదగా రేఖపల్లి తహసీల్దార్ కార్యాలయం వరకు రహదారి సౌకర్యం కల్పించాలని, మార్గమధ్యంలో కల్వర్టు ఏర్పాటు చేయాలని పీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు బొడ్డు సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మాధిరెడ్డి సత్తిబాబు, పార్టీ అధికార ప్రతినిధి చిక్కాల బాలు, సర్పంచ్ పిట్టా రామారావు ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి, ఉప సర్పంచ్ ముంజపు రాము తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యం.. గగనం

అవస్థలు పడుతున్న గిరిజన రైతులు



వైద్య సేవలందిస్తున్న సిబ్బంది



ముంచంగిపుట్టు పశు వైద్యశాల



ముంచంగిపుట్టులో పశు వైద్యాధికారి లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ..

- ఏడాదిగా ఖాళీగా ఉన్న పశు వైద్యాధికారుల పోస్టులు
- సిబ్బందితోనే సేవలు
- పాడిరైతుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ముంచంగిపుట్టు: పశు వైద్యంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ముంచంగిపుట్టు, జోలాపుట్టు పశు వైద్య శాలలకు వైద్యాధికారులను నియమించకపోవడమే ఇందుకు నిదర్శనం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాల్లో గిరిజన రైతుల చెంతకే వెళ్లి పశు వైద్యం అందించాలన్న సంకల్పంతో ఏర్పాటు చేసిన సంచార పశు వైద్య వాహనాలను కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో గిరిజన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన మండల కేంద్రంలోని ముంచంగిపుట్టు పశు వైద్యశాలలో ఏడాది కాలంగా పశు వైద్యాధికారి లేకపోయినా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. దీంతో పాటు జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలోని పశువుల ఆస్పత్రిలో సైతం ఏడాదికి పైగా పశువైద్యాధికారి లేరు. దీంతో పశు వైద్యం అందని ద్రాక్షగా మారింది. ఇక్కడ పశు వైద్యాధికారిగా పనిచేసిన భాస్కరరావు బదిలీపై విశాఖపట్నం వెళ్లి ఏడాదిపైగా గడిచింది. గత ఏడాదిగా ముంచంగిపుట్టు, జోలాపుట్టు పశు వైద్యశాలలకు ఇన్‌చార్జితోనే కొనసాగుతోంది. పశు వైద్య శాలలకు ప్రతి రోజు ఇన్‌చార్జీలు వచ్చే పరిస్థితి లేదని స్థానికులు చెబుతున్నారు. ముంచంగిపుట్టు, జోలాపుట్టు పశు వైద్యశాలలకు స్థానిక సిబ్బందే పెద్ద దిక్కుగా నిలుస్తున్నారు. రెండు పశు వైద్యశాలలపై ఆధారపడి 16 పంచాయతీలకు చెందిన 10,384 ఆవులు, గేదెలు, 14,286 మేకలు, 826 గొర్రెలు, 2,136కోళ్లు, ఇతర పెంపుడు జంతువులున్నాయి. పూర్తి స్థాయిలో పశు వైద్యాధికారులు లేకపోవడంతో పశువులకు పూర్తిస్థాయిలో వైద్యం అందని పరిస్థితి నెలకొంది. అత్యంత మారుమూల ముంచంగిపుట్టు మండలంలో రెండు పశు వైద్యశాలల్లో పశు వైద్యాధికారులను నియమించడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైనట్టు పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో పశువులకు వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సీజన్‌లో మార్పులు రావడంతో వ్యాధులు ప్రబలే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, పశు సంవర్ధకశాఖ ఉన్నతాధికారులు స్పందించి ముంచంగిపుట్టు మండలంపై దృష్టి సారించి, ముంచంగిపుట్టు, జోలాపుట్టు ప్రాంతాల్లో పశు వైద్యాధికారుల పోస్టులను భర్తీ చేయాలని మండల వాసులు, రైతులు కోరుతున్నారు.

పూర్తిస్థాయిలో సేవలందేలా చర్యలు

ముంచంగిపుట్టు, జోలాపుట్టు పశు వైద్యాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఇన్‌చార్జిలను నియమించాం. పశు వైద్య సేవలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. రానున్న రోజుల్లో పూర్తి స్థాయిలో రెండు పశు వైద్య శాలలకు పశు వైద్యాధికారులను నియమించి, రైతులకు ఇబ్బందులు లేకుండా పశువులకు వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఎల్.రాజా రవికుమార్, ఏడీ, పశుసంవర్ధకశాఖ, ముంచంగిపుట్టు మండలం

పశువైద్యాధికారిని నియమించాలి



ముంచంగిపుట్టు మండల కేంద్రంలో ఏడాది కాలంగా పశు వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉంది. పూర్తి స్థాయిలో పశు వైద్యాధికారిని నియమించాలని అనేక సార్లు పశు సంవర్ధకశాఖ ఉన్నతాధికారులను కోరాం. మూడు నెలలకు ఒక్కసారి జరిగే మండల సర్వసభ్య సమావేశాల్లో సైతం కోరుతున్నాం. నేటికి పశు వైద్యాధికారిని అధికారులు నియమించలేదు. పశువులు, మేకలు, గొర్రెలకు వైద్య సేవలు సక్రమంగా అందని పరిస్థితి నెలకొంది. తక్షణమే ముంచంగిపుట్టు పశు వైద్యశాలకు పశు వైద్యాధికారిని నియమించాలి.

– సీసా సుభాష్‌చంద్ర, సర్పంచ్, కించాయిపుట్టు పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం

అరకొర సేవలు



పశువులకు సరైన వైద్యం అందించాలంటే పశు వైద్యాధికారి ఉండాలి. గతంలో పశువైద్యాధికారి, సిబ్బంది ఇంటికే వచ్చి మరీ పశువులకు వైద్య సేవలందించేవారు.కొన్ని నెలలుగా పశువులు, మేకలకు జబ్బులు వస్తున్నా సేవలు అరకొరగా ఉన్నాయి. ఈనే సమయంలో ఆపరేషన్లు చేయడం లేదు. దీంతో పశువులు మృతి చెందుతున్నాయి. తక్షణమే ముంచంగిపుట్టు పశు వైద్యశాలకు పశు వైద్యాధికారిని నియమించాలి.

– వంతాల రాము, పాడిరైతు, వనుగుపుట్టు గ్రామం, ముంచంగిపుట్టు మండలం

ఘనంగా జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర జన్మదిన వేడుకలు



బర్త్ డే కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: మండల కేంద్రం ముంచంగిపుట్టులో మంగళవారం ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర జన్మదిన వేడుకలను జెడ్పీ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి,ఆమె భర్త తమర్బ నర్సింగరావు,ఎంపీపీ అరిసెల సీతమ్మ,సర్పంచులు,ఎంపీటీసీలు,వైఎస్సార్‌సీపీ మండల నేతలు,కార్యకర్తల సమక్షంలో జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర బర్త్ డే కేక్‌ను కట్ చేశారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు.కార్యక్రమంలో పాల్గొన్న వారంతా జెడ్పీ చైర్ పర్సన్ సుభద్రకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



అరకు అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న సీడీపీవో రాణి

డుంబ్రిగుడ: మండలంలోని అరకు పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఐసీడీఎస్ సీడీపీవో రాణి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె స్టాక్ రికార్డులతో పాటు చిన్నారుల హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయాలని, అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అంగన్‌వాడీ కార్యకర్తకు సూచించారు.

చాపరాయి వద్ద స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలి



విలేకరులతో మాట్లాడుతున్న అల్లూరి యువజన సేవాసంఘం సభ్యులు

డుంబ్రిగుడ: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం వద్ద పోతంగి పంచాయతీ యువతకు మాత్రమే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని స్థానిక అల్లూరి యువజన సేవాసంఘం అధ్యక్షుడు కమ్మిడి సూర్యప్రకాశ్, వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శి మఠం శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక యువతతో కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పోతంగి పంచాయతీకి పరిధిలో గల చాపరాయి జలపాతాన్ని పంచాయతీ తీర్మానంతో ఐటీడీఏలో అధికారులు విలీనం చేశారని, అయితే స్థానికులకు మాత్రమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అప్పటి ఐటీడీఏ అధికారులు హామీ ఇచ్చి, ఇప్పుడు వేరే ప్రాంతాలకు చెందిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం సరికాదన్నారు. గతంలో చాపరాయి జలపాతం వద్ద టెండర్ ప్రక్రియ ద్వారా సుమారు 20 మంది యువత ప్రత్యక్షంగా ఉపాధి పొందేవారని చెప్పారు. ప్రస్తుతం ఐటీడీఏ నిర్వహిస్తుండడంతో స్థానిక నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తపల్లి, కొల్లాపుట్టు, పద్మాపురం, అరకులోయ గిరిజన మ్యూజియంతో పాటు అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరకు పైనరీలో కూడా స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించారని చెప్పారు. చాపరాయి వద్ద మాత్రం స్థానికేతరులకు అవకాశం కల్పించడం తగదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈనెల 4న అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు వారు తెలిపారు. ఈకార్యక్రమంలో అల్లూరి యూత్ మండల కార్యదర్శి ఎం. నవసూర్య, విజయదశమి, జి.ఉదయ్‌కుమార్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలంలో హెచ్చరిక బోర్డు



ఆక్రమిత స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

గూడెంకొత్తవీధి: మండల కేంద్రం జీకే వీధిలో ప్రభుత్వ భూమిని గిరిజనేతరుడు ఆక్రమించడంతో దానిని ఖాళీ చేయాలని రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. మంగళవారం ఈ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు . ప్రభుత్వ భూమిని ఎవరు ఆక్రమించినా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు రామకృష్ణ హెచ్చరించారు.

ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఎటపాక: గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని వైఎస్సార్ సీపీ నేతలు కోరారు.మంగళవారం స్థానిక తహసీల్దార్ కారం సుబ్బారావుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత,ఎంపీపీ కాక కామేశ్వరి, మండల ముఖ్య నాయకులు ఆకుల వెంకటరామారావు మాట్లాడుతూ... వరదల దృష్ట్యా బఫర్ స్టాక్ పాయింట్లు ,పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి, బాధితులకు సహాయం చేయాలని, పశువులకు దాణా ఏర్పాటు చేయాలన్నారు. తుపాను కారణంగా వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వరదల సమయంలో లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసేందుకు అధికారులు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని తహసీల్దార్‌ను కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ గొంగడి వెంకట్రామిరెడ్డి,పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దామెర్ల రేవతి,కాక వెంకట్,శీలం నాగేశ్వరరావు,తోట శశికుమార్,ఆకుల దయాకర్, కోడూరు నవీన్,చల్ల మణి,కొరకాసుల సూర్య ప్రకాశరావు,మర్మం రాంబాబు,బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పోరాటం



గంగవరంలో సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న యూటీఎఫ్ నేతలు

గంగవరం: ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి పోరాటం చేయవలసిన అవసరం ఉందని యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కె.కృష్ణ అన్నారు. మండలకేంద్రం గంగవరంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 50 ఏళ్లుగా ఉపాధ్యాయుల సంక్షేమం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు యూటీఎఫ్ కృషి చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ప్రభుత్వాలు తీసుకొచ్చే సంస్కరణలు బడి మీద తల్లిదండ్రులకు నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తున్నాయన్నారు.ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పగిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష,కార్యదర్శులు సీహెచ్.రాంబాబుదొర, సీహెచ్ వెంకటేశ్వర్రావు,గౌరవాధ్యక్షులు కె.రఘుబాబు,మహిళాధ్యక్షురాలు ఎల్.రుక్మిణీదేవి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

కొయ్యూరు: మహిళా సర్పంచ్‌లకు ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకూ పరిపాలన అంశాలపై నర్సీపట్నం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మహిళా సర్పంచ్‌లకు సమాచారం ఇచ్చినట్టు చెప్పారు. సర్పంచ్‌లు విధిగా దీనికి హాజరు కావాలని ఆయన కోరారు

డిగ్రీ కళాశాల భవన నిర్మాణం పూర్తిచేయాలి



అసంపూర్తిగా ఉన్న డిగ్రీ కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న గిరిజన సంఘం నాయకులు

చింతూరు: అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు సీసం సురేష డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న కళాశాల భవనాన్ని మంగళవారం గిరిజన సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిదేళ్ల క్రితం చేపట్టిన భవన నిర్మాణం నిధుల కేటాయింపులేక అసంపూర్తిగా మిగిలిపోయిందని తెలిపారు. కళాశాల భవనం లేకపోవడంతో డిగ్రీ విద్యార్థులకు జూనియర్ కళాశాల భవనంలో ఒకపూట తరగతులు మాత్రమే నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి కారం నాగేష్, మొట్టుం రాజయ్య, వీరభద్రం, లెనిన్, వీరయ్య పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



లబ్బూరులో వైద్యాధికారికి సమ్మె నోటీసులందజేస్తున్న సీఐటీయూ నాయకులు,ఆశ కార్యకర్తలు

ముంచంగిపుట్టు: కార్మికులకు ఇబ్బంది కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకర్‌రావు డిమాండ్ చేశారు.మండలంలోని కిలగాడ, లబ్బూరు పీహెచ్‌సీల పరిధిలో పనిచేస్తున్న ఆశ వర్కర్లతో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని,కార్మికుల చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని,కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చాలన్నారు. కార్మిక సంఘం ఇచ్చిన పిలుపుమేరకు ఈ నెల9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కోరారు.అంతకముందు సమ్మె నోటీసును వైద్యాధికారి శ్యాంప్రసాద్‌కు లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్, సీఐటీయూ నాయకులు,ఆశ కార్యకర్తలు అందజేశారు.

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం



చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు, తెలుపుకొంటున్న వైద్యాధికారులు




వైద్యులను సన్మానిస్తున్న జెన్‌కో అధికారులు

చింతపల్లి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో జాతీయ వైద్యులు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరా ప్రియాంక మాట్లాడుతూ వైద్యులందరూ రోగులకు మెరుగైన వైద్యసేవలందించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం కేక్ కట్‌చేశారు.ఈ కార్యక్రమంలో చిన్నపిల్లలు వైద్యనిపుణులు నీలవేణి,స్త్రీవైద్య నిపుణులు వాసవి,జనరల్ మెడిసిన్ సంతోష్‌కుమార్,కంటి వైద్యనిపుణులు అనూష,సీనియర్ వైద్యాధికారులు భారతి,లావణ్య,రుక్మిణి, దంత వైద్యులు చంద్రశేఖర్,ల్యాబ్ టెక్నీషియన్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం

సీలేరు: అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సీలేరులో ఏపీ జెన్ కో భవ్య ఆస్పత్రి, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను పలువురు ఘనంగా సత్కరించారు. డాక్టర్ జి.మృదుల,ఆర్.ఆకాష్. సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఎస్.కె.మస్తాన్ వలీని జెన్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి,ఏడీఈ జైపాల్, ఏఈఈ సురేష్, భవ్య హెల్త్ సర్వీస్ ఫార్మసిస్ట్ బి.వినోద్. హెల్త్ సూపర్‌వైజర్ త్రినాథ్ తదితరులు సన్మానించారు.



కోతులగుట్ట సీహెచ్‌సీలో కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్‌బాబు

కూనవరం: మండల పరిధిలోని కోతులగుట్ట సీహెచ్ సీలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, వైద్యాధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్ బాబు, డాక్టర్ సి. తేజ, డాక్టర్ ప్రజ్వల, హెడ్‌నర్స్ బి బొజ్జి, ఫార్మసిస్ట్ తుష్టి జోగారావు, సిబ్బంది పలీనా, నగేష్, సాయమ్మ, శ్రీనివాసరెడ్డి, తేజ, సతీష్, రమేష్, బాపిరాజు, ప్రసన్న, రమాదేవి, భువనేశ్వరి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా రోడ్లు



బురదమయంగా మారిన రాజవొమ్మంగిలో ఓ రహదారి

రాజవొమ్మంగి : మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామీణ రోడ్లన్నీ బురదమయంగా మారాయి. దీంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముసురు వాతావరణం కారణంగా ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వరి నారుమడుల తయారీకి వర్షం అడ్డంకిగా మారింది. వర్షాలు కురుస్తున్నా వట్టిగెడ్డ రిజర్వాయర్‌లోకి, చెరువుల్లోకి నీరు చేరక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వర్షాలతో ఆకుమడులు ఆలస్యం



కొయ్యూరులో కురుస్తున్న వర్షం

కొయ్యూరు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఆకుమడులు వేసేందుకు అవకాశం లేకుండా పోతోంది.వర్షాలు తగ్గితేనే దుక్కులు దున్ని, ఆకుమడులు వేసేందుకు వీలు కలగుతుందని రైతులు తెలిపారు. పూర్తిస్థాయిలో విత్తనాలు పంపిణీ చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గంగవరం/అడ్డతీగల: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు.గంగవరం మండలం ఎండపల్లి,ఇ.రామవరం, అడ్డతీగల మండలం వేటమామిడి,కోనలోవ గ్రామాల్లో మంగళవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను పంపిణీ చేసి, మాట్లాడారు.ప్రతి నెలా మొదటి వారంలోనే నిరుపేదలందరికీ సామాజిక పింఛన్లు అందిస్తున్నామన్నారు.

పీఎం జన్‌మన్ బిల్లులందక అవస్థలు

- జెడ్పీటీసీ బొంజుబాబు



అంద్రవరలో పీఎం జన్‌మన్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ బొంజుబాబు

పెదబయలు: పీఎం జన్‌మన్ పథకం కింద మంజూరు చేసిన ఇళ్లకు సకాలంలో బిల్లులు అందక లబ్ధిదారులు అవస్థలకు గురవుతున్నారని జెడ్పీటీసీ కూడ బొంజుబాబు తెలిపారు. పెదకోడాపల్లి పంచాయతీ అంద్రవర, పెదకోడాపల్లి, పోయిపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. పీఎం జన్‌మన్ లబ్ధిదారులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బొంజుబాబు మాట్లాడుతూ అంద్రవరలో 19 మంది లింటల్ స్థాయి వరకు ఇళ్లు నిర్మించినా, పునాది బిల్లులు కూడా అందలేదన్నారు. ఇదే పరిస్థితిలో మిగిలిన గ్రామాల్లో కూడా ఉందన్నారు. పథకం లబ్ధిదారులు అప్పుచేసి ఇంటి నిర్మాణం చేపడుతున్నారని, బిల్లులు సకాలంలో మంజూరుకాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. అధికారులు స్పందించి వెంటనే బిల్లులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పాంగి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.